# తాండూరు, మేడ్చల్‌లో చెల్లని రూపాయి

# మహేశ్వరంలో చెల్లుతుందా..?

## వరదలొస్తే ట్రాక్టర్లలో తిరిగి పోయినోళ్లు కావాల్నా..?

## ప్రజలతో కలిసి నడిచిన సబితమ్మ కావాల్నా..?

- కరోనా, వరదలతో ప్రజలు అల్లాడుతుంటే.. పత్తాలేని నాయకులు.. ఇప్పుడు ఓట్లకోసం వస్తున్నరు
- రూ.832 కోట్లతో ముంపు సమస్యను పరిష్కరించిన.. చేసిన అభివృద్ధి మీ కండ్లముందరే ఉన్నది
- మరోసారి ఆశీర్వదించండి.. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా
- చివరి శ్వాస వరకు మీ వెంటే ఉంటా.. మహేశ్వరం రోడ్ షోలో మంత్రి సబితాఇంద్రారెడ్డి



రోడ్ షో కార్యక్రమానికి భారీగా తరలి వచ్చిన జనం

బడంగ్‌పేట / మహేశ్వరం, నవంబర్ 25 : అక్కగా ఆదరించండి, చెల్లిగా చేరదీయండి.. కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విద్యాశాఖ మంత్రి పటోళ్ళ సబితా ఇంద్రారెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మహేశ్వరం నియోజకవర్గంలోని రావిర్యాల, మోహబత్ నగర్, తుమ్మలూరు, ఎన్‌డీ తండా, కేసీ తండా, మహేశ్వరం టౌన్, బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 2, 3, 4, 5, 24, 25, 26వ డివిజన్లతో పాటు మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 12, 13, 29, 30, 31, 32, 33, 34, 35, 36 డివిజన్లలో మంత్రి రోడ్ షో నిర్వహించారు. అన్ని ప్రాంతాల్లో ప్రజలు గులాబీ పువ్వులు చల్లుతూ మంత్రికి అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, రాహుల్ గాంధీతో తెలంగాణ రాష్ట్రానికి ఒరిగేది ఏమిలేదని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ వల్లనే తెలంగాణ రాష్ట్రానికి న్యాయం జరుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ వస్తే కరెంటు ఉండదు, బీజేపీ వస్తే మతం, కులం అంటూ చిచ్చు పెడుతరు. తెలంగాణ రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్, బీజేపీ పాలిత ప్రాంతాల్లో ఉన్నదా అని ప్రశ్నించారు. కరోన, వరద సమయంలో ప్రజలు కష్టాలతో అల్లాడుతుంటే పత్తాలేని బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఇవ్వాల ఓట్ల కోసం ప్రజలను మోసం చేయడానికి వస్తున్నారని మండిపడ్డారు. గతంలో వర్షాలతో కాలనీలు మునిగి పోయి ప్రజలు అల్లాడుతుంటే బీజేపీ నాయకులు ట్రాక్టర్లలో తిరిగి పోయారని గుర్తుచేశారు. బీఆర్‌ఎస్ నాయకులు మోకాళ్ళలోతు నీటిలో ప్రజలతో కలిసి సహాయక చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఆపదలో ఉన్న వారిని ఓదార్చ కుండా ట్రాక్టర్లలో తిరిగి పోయిన వ్యక్తులకు ఓట్లు వేస్తారా? ప్రజలతో కలిసి నడిచిన సబితమ్మను గెలిపిస్తారా..? నిరంతరం ప్రజల కోసం పనిచేస్తున్న వారికి ప్రాధాన్యత ఇస్తారా? చుట్టపు చూపుగా వచ్చి ఓట్లు వేసుకునే వాళ్లకు ప్రాధాన్యత ఇస్తారా..? ప్రజలు ఆలోచన చేయాలన్నారు. చివరి శ్వాస వరకు ప్రజల కోసం పనిచేస్తానని హామీ ఇచ్చారు. బడంగ్‌పేట, మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న కాలనీలను బంజారాహిల్స్‌కు ధీటుగా అభివృద్ధి చేయిస్తానని చెప్పారు.



మహేశ్వరంలో రోడ్ షోలో ప్రసంగిస్తున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి

### కాంగ్రెస్ అభ్యర్థికి మహేశ్వరం సరిహద్దులు తెలుసా..?

కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేస్తున్న అభ్యర్థికి మహేశ్వరం సరిహద్దులు తెలుసా అని మంత్రి సబితారెడ్డి ప్రశ్నించారు. తాండూరు, మేడ్చల్‌లో చెల్లని రూపాయి మహేశ్వరంలో ఎలా చెల్లుతుందని అన్నారు. తాండూరు సీటు అడిగితే మహేశ్వరం ఇచ్చింద్రు తనకు ఇష్టం లేదని అభ్యర్థి చెప్తున్నాడు.., అలాంటి వ్యక్తి ఇక్కడ ఉంటాడా..? ఓట్లు అయిపోయిన తెల్లారే ఎవరూ కనిపించరన్నారు. డబ్బుల సంచులతో వస్తున్న వారు నాయకులను కొని రాజకీయం చేయాలని చూస్తున్నారని, ప్రజలు గమనించాలన్నారు.

### చేసిన అభివృద్ధి మీ కండ్లముందరే ఉన్నది

సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధిని చూసి కారు గుర్తుకు ఓట్లు వేయాలని మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. సౌభాగ్యలక్ష్మి పథకం ద్వారా నెలకు ప్రతి మహిళలకు మూడు వేలు ఇవ్వడంతో పాటు 93 లక్షల తెల్లరేషన్ కార్డు దారులందరికీ బీమా సౌకర్యం కల్పిస్తామన్నారు. నియోజకవర్గంలోని తుక్కుగూడ, జల్‌పల్లి మున్సిపాలిటీలు, బడంగ్‌పేట, మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్లలో రూ.832 కోట్లతో ట్రంక్‌లైన్, నాలాల అభివృద్ధి, వరద ముంపు సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. రూ.280 కోట్లతో తాగునీటి సమస్య, రూ.40కోట్లతో 11 చెరువుల సుందరీకరణ, 13 బస్తీ దవాఖానలు, 8 అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈనెల 30న బీఆర్‌ఎస్‌కు ఓటువేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఇన్‌చార్జి ఎంపీపీ సునితాఅంద్యానాయక్, మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, తుక్కుగూడ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, మహేశ్వరం బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రాజునాయక్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేశ్ గౌడ్, శ్రీనునాయక్, రవినాయక్, తదితరులు ఉన్నారు.

## అంబర్‌పేటలో బీఎస్పీ ఖాళీ

- నియోజకవర్గం అధ్యక్షుడు సహా బీఆర్‌ఎస్‌లో చేరిక



బీఎస్పీ అధ్యక్షుడు సంజీవచారిని బీఆర్‌ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, తదితరులు

కాచిగూడ, నవంబర్ 25 : తెలంగాణ రాష్ట్రం ఐటీ, టెక్నాలజీ, టూరిజంతో పాటు అన్ని రంగాల్లో దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిచిందని, సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, ప్రగతిని పొరుగు రాష్ట్రాలు కూడా ఆదర్శంగా తీసుకుంటున్నాయని అంబర్‌పేట బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్శితులై అంబర్‌పేట నియోజకవర్గం బీఎస్పీ అధ్యక్షుడు ఆర్.సంజీవచారి ఆధ్వర్యంలో శనివారం బీఎస్పీ పార్టీకి చెందిన 230మంది బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ వారికి పార్టీ కండువా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా ప్రతి గడపకు ఏదో ఒక రూపంలో సీఎం కేసీఆర్ పథకం అందిందని అన్నారు. తెలంగాణ అభివృద్ధిని చూసి రాజకీయాలకు అతీతంగా ప్రజలందరు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో గొట్టాల వినోద్‌చారి, సంపత్‌చారి, కృష్ణమాచారి, పడకంటి అంజయ్యచారి, శ్రీహరిచారి, భాస్కరాచారి, వేణుగోపాలచారి, తదితరులు పాల్గొన్నారు.

# అసత్య ఆరోపణలు చేస్తే..

## ఓటుకు నోటు దొంగ రేవంత్, పాస్‌పోర్టు కంభకోణాల దొంగ మధుయాష్కీ సంస్కారంతో మాట్లాడాలి

# సెప్టిక్ ట్యాంక్‌లో ముంచేస్తాం

- నిజామాబాద్ నుంచి పారిపోయి వచ్చిన 420 సంస్కార హీనంగా మాట్లాడితే బుద్ధి చెబుతాం
- అమ్మాయిలను విదేశాలకు ఎగుమతి చేసే సంస్కృతి నీది
- అనవసర వ్యాఖ్యలు చేస్తే తొక్కి తోలు తీస్తాం
- వరదల సమయంలో ఎక్కడికి పోయావ్ రేవంత్.?
- ఎల్బీ నగర్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్, నవంబర్ 25 : ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగ రేవంత్ రెడ్డి, పాస్‌పోర్టు, వీసాల కుంభకోణంలో ఉన్న మరో దొంగ మధుయాష్కీతో కలిసి నాపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉన్నదని ఎల్బీనగర్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఎల్బీనగర్‌లో మాజీ కార్పొరేటర్లు, బీఆర్‌ఎస్ ఇన్‌చార్జితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో వరదల సమయంలో కన్పించని ఎంపీ రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారం మాత్రం వర్షంలో చేస్తూ తనపై అసత్య అరోపణలు చేశారన్నారు. 36 సంవత్సరాల నుంచి చేస్తున్న మార్నింగ్ వాక్‌పై మధుయాస్కీ అవాకులు, చెవాకులు పేలడం, దానికి మద్దతుగా వచ్చిన పెద్ద దొంగ రేవంత్‌రెడ్డిలు మూసీ నదిలో నన్నేం ముంచుతారు గానీ, వారిని హయత్‌నగర్ దాటాక ఉన్న సెప్టిక్ ట్యాంక్‌లో ముంచేస్తామని అన్నారు. రాజకీయాల్లో సంస్కారంతో మాట్లాడాలని, సంస్కార హీనంగా మాట్లాడితే గట్టిగా బుద్ధి చెబుతామన్నారు. ప్రజల సమస్యలను పరిష్కారం చేసేందుకు మార్నింగ్ వాక్ చేస్తున్న పవిత్ర కార్యక్రమంపై వ్యంగ్యంగా మాట్లాడిన నిజామాబాద్ నుంచి పారిపోయి వచ్చిన దొంగ మధుయాష్కీకి తగిన బుద్ధి చెబుతామన్నారు. నిజామాబాద్‌లో మధుయాష్కీ మీద వచ్చిన ఆరోపణలు నేను చేసినవి కాదని, వీసాల కుంభకోణం, పాస్‌పోర్టు కుంభకోణంతో పాటుగా అమ్మయిలను విదేశాలకు ఎగుమతి చేస్తాడని కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ నాయకుడు ఆరోపణలు చేశాడన్నారు. హయత్‌నగర్ తన స్వస్థలం అంటున్న మధుయాష్కీకి ఇప్పటికైనా ఈ ప్రాంతంపై ప్రేమ వచ్చింది మంచిదే కానీ అనవసర వ్యాఖ్యలు చేస్తే తొక్కి తోలు తీస్తామని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పుడు తాను ప్రతిపక్ష నాయకులపై వ్యక్తిగత ఆరోపణలు చేయలేదని, వారిపై ఉన్న కేసుల విషయాన్నే చెప్పానన్నారు. మధుయాష్కీ, సామ రంగారెడ్డిలపై వారు ఇచ్చిన అఫిడవిట్‌లోనే కేసుల వివరాలను పొందు పర్చారని, దానినే ప్రస్తావించానని తెలిపారు. మరోసారి తనపై వ్యక్తిగత ఆరోపణలు చేస్తే ఖబర్దార్ అంటూ సుధీర్‌రెడ్డి హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, తదితరులు

### రేవంత్ మాటలు పనికిరానివి : ముద్దగౌని

ఎల్బీనగర్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి ముద్దగౌని రామ్మోహన్ గౌడ్ మాట్లాడుతూ ఎల్బీనగర్ నియోజకవర్గం తెలంగాణ ప్రభుత్వ హయంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. రేవంత్‌రెడ్డి సభలో ఏదో ఒక పనికిరాని విషయం మాట్లాడిపోతారని అందరికీ తెలుసు అన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో అన్ని కులాలు, మతాల వారు పనిచేసే నాయకుడిని గెలిపించాలని కోరుతున్నారని, పనిచేసే సుధీర్‌రెడ్డికే ఓటు వేస్తారన్నారు. ఎల్బీనగర్‌లో అభివృద్ధి చేశామంటే సుధీర్‌రెడ్డి, తాను, తమ మాజీ కార్పొరేటర్లు చేశారని అన్నారు. సామరంగారెడ్డి, మధుయాష్కీ ఈ ప్రాంతానికి చేసిందేమీ లేదన్నారు. బీఆర్‌ఎస్ నాయకుడు కుంట్లూరు వెంకటేశ్ గౌడ్ మాట్లాడుతూ మధుయాష్కీ గౌడ్ పది సంవత్సరాలు నిజామాబాద్‌లో ఉన్నా అక్కడ ఎలాంటి పనులు చేయలేదు కాబట్టీ, అక్కడ పోటీ చేసేందుకు అవకాశం లేక ఇక్కడికి వచ్చి పోటీ చేస్తున్నారన్నారు. నియోజకవర్గం ప్రజలు ఎప్పుడు మార్పు కోరుతారో తెలుసుకోవాలని, ఎమ్మెల్యే అందుబాటులో లేకపోతే, అభివృద్ధి చేయకపోతే దూరం అవుతాయని, ఏ పార్టీ వారు వచ్చినా పనులు చేసి పెట్టే సుధీర్‌రెడ్డి ఉండగా ఇక్కడ ఎలామార్పు కోరుతారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ముద్దగౌని లక్ష్మీప్రసన్న, చెరుకు సంగీత ప్రశాంత్‌గౌడ్, రమావత్ పద్మానాయక్, కొప్పుల విఠల్‌రెడ్డి, జీవీ సాగర్‌రెడ్డి, ముద్రబోయిన శ్రీనివాస్‌రావు, జిట్టా రాజశేఖర్‌రెడ్డి, జిన్నారం విఠల్‌రెడ్డి, వరప్రసాద్‌రెడ్డి, ఉదయ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.